రైతన్న నేస్తాలు.. రైతు భరోసా కేంద్రాలు

- గ్రామ స్థాయిలో రైతుల చెంతకే సేవలు
- పంటల సాగుపై రైతులకు సలహాలు, సూచనలు
- ఎరువులు, విత్తనాల పంపిణీ
- గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ

బుట్టాయగూడెం: టీడీపీ పాలనలో అన్నదాతల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రైతులు విత్తనాలు, ఎరువుల కోసం నానా అవస్థలు పడేవారు. పంటలకు పెట్టుబడులు లేక అప్పు చేసి మరీ పంటలు సాగు చేసేవారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రమైన నష్టాలను ఎదుర్కొనే వారు. రైతుల కుటుంబాలు అప్పుల ఊబిలో కొట్టుమిటాడుతూ జీవనం సాగించేవి. అయితే నాటి రైతుల కష్టాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా తొలగించారు. ప్రజా సంకల్పయాత్రలో రైతుల కష్టాలను దగ్గరగా చూడడంతో పాటు, రైతుల బాధలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో నేను ఉన్నాను.. నేను విన్నాను అని రైతులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. అన్నదాతలకు ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. ఉత్పత్తుల నుంచి పంటలు కొనుగోలు చేసే వరకూ సహాయం చేస్తూ రైతులకు ఎటువంటి కష్టం రాకుండా అండగా నిలిచింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల చెంతకే అన్ని సేవలను అందించింది. వ్యవసాయానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తోడ్పాటు అందించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రైతు భరోసా కేంద్రంలో రైతులకు యంత్ర పనిముట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)


రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఎరువులు సిద్ధం చేస్తున్న దృశ్యం (ఫైల్)


విత్తన శుద్ధిపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం


వ్యవసాయ భూమిలో మట్టి నమూనా సేకరిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

ఆర్‌బీకేలోనే విత్తనాలు, ఎరువుల పంపిణీ

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు మరింత మేలు చేస్తున్నాయి. ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుంది. ఎరువులు, విత్తనాలు ఈ కేంద్రాల ద్వారానే అందించడం జరుగుతుంది. దీనితో ఎరువుల కోసం దూరాభారం ప్రయాణం చేయాల్సిన కష్టం రైతులకు తగ్గింది. ఆర్‌బీకేల్లో కొనుగోలు చేయడం వల్ల దళారుల బెడద తప్పింది. అలాగే గిరిజన ప్రాంతంలో 90 శాతం సబ్సిడీపై గిరిజనులకు విత్తనాలను, ఎరువులను ఇవ్వడం జరుగుతుంది. వ్యవసాయ పనిముట్లతో పాటు ట్రాక్టర్‌లు కూడా అందజేశారు.

కియోస్కో యంత్రంతో ఎన్నో ప్రయోజనాలు

రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాల ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరాయి. రైతులకు కావాల్సిన అన్ని రకాల సబ్సిడీ ఎరువులు, విత్తనాలు రైతులకు 48 గంటల్లోనే నేరుగా అందుతున్నాయి.

ఇ–క్రాప్ బుకింగ్, పంట నష్ట పరిహారం

ప్రతి రైతు తాను సాగు చేస్తున్న పంటలకు సంబంధించి ఇ–క్రాప్ బుకింగ్ చేసుకుంటున్నారు. తద్వారా విపత్తులు, తుపానుల ద్వారా పంట నష్టం వాటిల్లితే ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారం పొందే అవకాశం ఉంది. రైతులకు పంట రుణాలను కూడా అందజేస్తున్నారు.

గడచిన ఐదేళ్లల్లో.. గడచిన ఐదేళ్లలో పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో ఉన్న 111 ఆర్‌బీకేల ద్వారా 41,584 మంది రైతులు ఉండగా వీరికి రైతుభరోసా, పీఎం కిసాన్ పథకం ద్వారా రైతుల బ్యాంక్ ఖాతాల్లో సుమారు రూ.32.03 కోట్లు జమ చేయడం జరిగింది. అదేవిధంగా 99 మంది రైతులకు రూ.134 లక్షలతో యంత్రాలు, పనిముట్లను పంపిణీ చేశారు. ఇలా అనేక సేవలను ఆర్‌బీకేల్లో అందించడం జరుగుతుంది.

ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు అధికారుల సన్నాహాలు

మండు వేసవికాలంలో గతంలో ఎన్నడూలేని విధంగా వర్షాలు అధికంగా కురుస్తున్నాయి. అలాగే ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే వస్తాయని వాతావరణ శాఖ ప్రకటనల నేపథ్యంలో రైతులు వ్యవసాయ సాగుకు సిద్ధం అవుతున్నారు. అలాగే రైతులకు ఆర్బీకేల ద్వారా విత్తనాలు, అన్నిరకాల సేవలు అందించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మన్యప్రాంత రైతులకు 90 శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు ఇప్పటికే ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం చేశారు. అలాగే సాగుకు సంబంధించి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

ఆర్‌బీకేలతో మేలు



గతంలో పంటలకు విత్తనాలు, ఎరువులు కొనుగోలు కోసం మండల కేంద్రాలకు పరుగులు తీసేవారు. అలాగే దళారుల చేతిలో మోసపోయేవారం. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా మాకు రాయితీపై ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ఇక్కడ వ్యవసాయ యంత్రాలను కూడా కేరింగ్ ద్వారా అందిస్తున్నారు. ఆర్‌బీకేల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– కలగర నాని, రైతు, కొమ్ముగూడెం, బుట్టాయగూడెం మండలం

రైతులకు కష్టాలు తొలగాయి



గతంలో విత్తనాలు, ఎరువుల కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేవాళ్లం. ఒక రోజంతా సమయం పట్టేది. నాణ్యమైన సరుకులు దొరికేవి కావు. పైపెచ్చు రవాణా ఖర్చులు కూడా ఎక్కువయ్యేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రంలో రైతుల చెంతకే సేవలు అందుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

– ధర్ముల బాబూరావు, రైతు, సీతప్పగూడెం, బుట్టాయగూడెం మండలం

నూరుశాతం రైతులకు సేవలు



ఆర్‌బీకేల ద్వారా రైతులకు నూరుశాతం సేవలు అందిస్తున్నాం. రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నాం. అలాగే పంటల సాగుపై రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

– డి.ముత్యాలరావు, వ్యవసాయాధికారి, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

మద్ది ఆంజనేయస్వామి సన్నిధిలో...


స్వామివారి సన్నిధిలో దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ సుబ్బారావు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని బుధవారం దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ సుబ్బారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం సుబ్బారావుకి ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ వరం


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు, అధ్యాపకులతో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

చింతలపూడి: ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కార్యక్రమం వరంలా మారిందని చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆరు నెలల పాటు వివిధ కంపెనీల్లో లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ చేశారని, ఇందులో 56 మంది ఉద్యోగాలు సాధించారని చెప్పారు. విద్యార్థుల ప్రతిభ, అధ్యాపకుల కృషి కారణంగా విద్యార్థులు కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం


వామిశెట్టి హరిబాబు

జంగారెడ్డిగూడెం రూరల్: సంక్షేమం, అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉన్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక ఓటర్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల వైపే నిలిచారన్నారు. నియోజకవర్గంలో మంచి మెజార్టీతో చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ల గెలుపు ఖాయమని హరిబాబు అన్నారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్


వంజంవారిగుంపులో పోలీసుల కార్డెన్ సెర్చ్

కుక్కునూరు: మండలంలోని వంజంవారిగుంపు గ్రామంలో బుధవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కుక్కునూరు సీఐ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సై ఎస్.రామకృష్ణ, సిబ్బంది గ్రామంలో పర్యటించి తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేని 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికలు ముగినప్పటికీ, కౌంటింగ్ ప్రక్రియ ఇంకా ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు సీఐ వి.శ్రీనివాస్ తెలిపారు.

నృసింహ జయంతి పూజలు


స్వామి, అమ్మవార్లకు హారతులిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన, ఐఎస్ జగన్నాధపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో నృసింహ జయంతిని పురస్కరించుకుని బుధవారం విశేష కార్యక్రమాలు జరిగాయి. ముందుగా అర్చకులు స్వామివారికి విశేష పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అనంతరం సహస్రనామార్చన, నీరాజన మంత్ర పుష్పాలు, ప్రసాద వితరణను జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

'మానవత' ఆర్థిక సాయం

కొయ్యలగూడెం: గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ బైపీసీ పూర్తిచేసిన పిల్లా దివ్యసాయి నర్సింగ్ కోర్స్ చదువు నిమిత్తం మానవత సంస్థ రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేసింది. కార్యక్రమంలో ప్రెసిడెంట్ బొమ్మ మోహన్, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, ప్రకాశం జనార్దన్, రామకృష్ణ, ప్రకాశం కాలేజీ ప్రిన్సిపాల్ స్వామి పాల్గొన్నారు.

సత్యదేవుని కల్యాణం.. నేత్రపర్వం


సత్యదేవుని తిరు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

లింగపాలెం: రాష్ట్రంలోనే లింగపాలెం మండలంలో రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన రంగాపురం సత్యదేవుడు, భూదేవీ, నీళాదేవీల పరిణయం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, బాణసంచా వెలుగుల మధ్య బుధవారం రాత్రి స్వామి వారి కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. వేదమంత్రాల నడుమ పాంచరాత్ర ఆగమ పండితులు గోపాలాచార్యులు, ఆలయ అర్చకులు తిరుమల కాండూరి శేషాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. చిన్నతిరుపతి దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో ఈ కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు గ్రామస్తులు, దాతల సహకారంతో ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. భక్తులకు స్వామివారి తలంబ్రాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. ద్వారకాతిరుమల దేవస్థానం ఏఈఓ లక్ష్మణ స్వామి, సీనియర్ అసిస్టెంట్ శ్రీను, స్థానిక దేవాలయ అసిస్టెంట్ శేట్టిపల్లి గోపి పాల్గొన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

ద్వారకాతిరుమల: శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని టీటీడీ అధికారులు, సిబ్బంది బుధవారం పట్టు వస్త్రాలను సమర్పించారు. చినవెంకన్న దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ రమణరాజులకు వీటిని అందజేశారు.


మెడికల్ కిట్ల అందజేత

శ్రీవారి దేవస్థానం ప్రాణదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రానికి విజయవాడకు చెందిన రాఘవన్ మూడు ఫస్ట్ ఎయిడ్ కిట్లు, రెండు డిజిటల్ బీపీ మెషిన్‌లు, రెండు డిజిటల్ షుగర్ మెషిన్‌లను బుధవారం అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. భాస్కర మెడికల్ ఏజెన్సీ సురేష్ సహాయంతో వీటిని అందించినట్లు దాత తెలిపారు.


వేడుకలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, భక్తులు

చూసిన కనులదే భాగ్యం


కూచిపూడి నృత్యం


కల్యాణ ఘడియలో శ్రీవారు, అమ్మవార్లు

ఉభయ దేవేరులతో దేవదేవుని కల్యాణం.. అంగరంగ వైభవంగా జరిగింది. వైశాఖమాస తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణ వేడుక భక్తుల గోవిందనామ స్మరణలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ అట్టహాసంగా జరిగింది. **ఈ అపురూప ఘట్టాన్ని** తిలకించిన భక్తులు భక్తపారవశ్యంతో పులకించారు.

– ద్వారకాతిరుమల


అలరించిన భరతనాట్య ప్రదర్శనలు

తిరుమల తిరుపతికి బైక్ యాత్ర


భోగోలు నుంచి బైక్‌పై తిరుమల వెళుతున్న దృశ్యం

లింగపాలెం: వైఎస్ జగన్‌మోహనరెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ భోగోలు పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఆచంట రాజారావు, శనగవరపు నవీన్, పంది నాగరాజు బుధవారం బైక్‌పై తిరుమల తిరుపతి వెళ్లారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని, చింతలపూడి ఎమ్మెల్యేగా కంభం విజయరాజు గెలుపొందాలని కోరుతూ తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామికి మొక్కుకుని ఈ యాత్ర చేపట్టినట్లు చెప్పారు. వీరి బైక్ యాత్రకు సర్పంచ్ తాడేపల్లి శాంతరావు పార్టీ జెండాను ఊపి ప్రారంభించారు.

గౌరవ వేతనం చెల్లించాలి

టి.నరసాపురం: తమకు గౌరవ వేతనం చెల్లించాలని మండలంలోని బీఎల్‌వోలు కోరారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గత మూడేళ్లుగా తాము అందిస్తున్న సేవలకుగాను ఏడాదికి రూ.6 వేలు చెల్లిస్తామని అధికారులు పేర్కొన్నప్పటికీ ఇప్పటికీ సదరు సొమ్మును చెల్లించలేదన్నారు. అలాగే ఎన్నికల సమయంలో నిర్వహించిన విధులకు సైతం పారితోషికం ఇవ్వలేదన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన

ద్వారకాతిరుమల: గత కొద్దిరోజులుగా పంచాయతీ నుంచి మంచినీరు అందక తాము తీవ్ర ఇక్కట్లకు గురౌతున్నామంటూ దొరసానిపాడు ఎస్సీ కాలనీ వాసులు బుధవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. సర్పంచ్ లక్కాబత్తుల సిద్దిరాజు, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి ఎస్సీ కాలనీని సందర్శించి, హుటాహుటిన పైప్‌లైన్ బాగుచేయించి వెంటనే మంచినీటిని సరఫరా చేశారు.

రామానుజపురంలో ఫ్యామిలీ డాక్టర్

కొయ్యలగూడెం: అధిక రక్తపోటు, మధుమేహం ఉన్న వారు దగ్గర్లో ఉన్న ప్రభుత్వ వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు వాడాలని బయ్యనగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి వి.సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం రామనుజపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యులు రక్తపోటు, మధుమేహం రక్త పరీక్షలు చేసి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్య అధికారి వి.సత్యనారాయణ, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బీపీ, షుగర్, వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా 40 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని, సమతుల్య ఆహారం తీసుకోవాలని, ఒత్తిడికి లోనుకాకూడదని వివరించారు. ఎంఎల్ హెచ్‌పీ బి.యువరాజు, ఏఎన్ఎం సోములమ్మ, సిబ్బంది మహబూబ్, విజయలక్ష్మి, సుజాత, నాగమణి, ఎస్‌కే షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.


రామానుజపురంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

టి.నరసాపురం: వరకట్న వేధింపులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. వీరభద్రవరం గ్రామానికి చెందిన కాటోటోయిన రాజేశ్వరికి, సురేష్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఈ సమయంలో కట్నంతో పాటు వివిధ లాంఛనాలు సైతం ఇచ్చారు. అయితే అదనపు కట్నం తీసుకురావాలని కొంతకాలంగా సురేష్, అతని తల్లితండ్రులు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలి

డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం దర్భగూడెం గ్రామ సచివాలయాన్ని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలోని రికార్డులను, సిబ్బంది వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుధ్యాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. డ్రెయిన్స్‌లు శుభ్రపరచాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, మలాథియాన్, అబేట్, తదితర క్రిమిసంహారక మందులను పిచికారీ చేసి దోమల వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. అనంతరం లక్ష్మీపురం గ్రామంలో ఓవర్‌హెడ్ తాగునీటి ట్యాంక్‌ను పరిశీలించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి విధిగా క్లోరినేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. దోమల నివారణకు అన్ని గ్రామాల్లో ఫాగింగ్ జరపాలని ఆదేశించారు. కార్యక్రమంలో విస్తీర్ణ అధికారి నిఖిల్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఆడమ్, తదితరులు పాల్గొన్నారు.


దర్భగూడెం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్